క్లుప్తంగా

సింహగిరిపై చిన్నారులకు అక్షరాభ్యాసాలు



అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వసంత పంచమిని పురస్కరించుకుని సింహగిరిపై చిన్నారులకు అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. లక్ష్మీనారాయణస్వామి వ్రత మండపంలో అర్చకులు చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసాలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలచేత అక్షరాలు దిద్దించారు.

ఘనంగా తీర్థమహోత్సవాలు

సబ్బవరం: అమృతపురం, వెదుళ్లనరవ గ్రామాల్లో దుర్గమాంబ, ఎల్లుప్పి గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు, బుర్రకథలు ఆకట్టుకున్నారు. ఆలయాల్లో విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమృతపురం గ్రామంలో సర్పంచ్ బైలపూడ గౌరి, బైలపూడి రామారావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, వెదుళ్లనరవలో బొట్టా ముత్యాలు, మొల్లి ముత్యాలనాయుడు, చట్టి తాతారావు, సర్వసిద్ధి బోరయ్య అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఎల్లుప్పిలో సీతారాములను సర్పంచ్ ఉగ్గిన దేముడమ్మ, ఉగ్గిన నాయుడు తదితరులు దర్శించుకున్నారు.

వేడుకగా నర్సింగబిల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం, జనతా కాలనీ సమీప గొల్లపేటలో నూతనంగా నిర్మించిన నర్సింగబిల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో 9.45 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో నిర్వహించారు. అనంతరం చండీ హోమం, జయాది హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ పూజల్లో ఆలయ నిర్మాణ దాత కేవీ బాలసుబ్రహ్మణ్యం దంపతులు పాల్గొన్నారు.

నర్సింగబిల్లి అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

త్రివిధ దళాలకు ఏయూ సేవలు అమోఘం



గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, డీజీ శరద్‌కపూర్

ఏయూ క్యాంపస్: దేశ రక్షణ రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల ఉన్నత విద్య కలలు సాకారం చేసుకునే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయ అందిస్తున్న సహకారం అమోఘమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ డీజీఆర్ విభాగం డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ శరద్‌కపూర్ అన్నారు. గురువారం ఏయూలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. శరద్‌కపూర్ మాట్లాడుతూ త్రివిధ దళాలలో పనిచేసి పదవీ విరమణ చేసే ఉద్యోగులకు నూతన భవిష్యత్తును అందించే దిశగా ఏయూ కృషి చేస్తుందన్నారు. వేడుకల్లో భాగంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, త్రివిధ దళాల ఉద్యోగుల గౌరవ వందనాన్ని వీసీ ప్రసాదరెడ్డి, అతిథి శరద్‌కపూర్ స్వీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మది నిండా మువ్వన్నెల జెండా

• ఘనంగా గణతంత్ర వేడుకలు



రవీంద్రభారతిలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు



అప్పన్న దేవస్థానం పరిపాలన కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరాజు

పరవాడ: గణతంత్ర దినోత్సవాన్ని పెందుర్తి నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, విద్యాలయాలు, సంస్థలు, బ్యాంకుల వద్ద గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. విద్యార్థుల విన్యాసాలు అలరించాయి.

ఎన్టీపీసీలో..

సింహాద్రి ఎన్టీపీసీలో గణతంత్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. దీపాంజలి నగర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా జెండాను ఆవిష్కరించారు. వేడుకల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జీజీఎం సిన్హా మాట్లాడుతూ దేశ నిర్మాణానికి స్వాతంత్ర్య సమరయోధుల కృషిని ఆయన ప్రశంసించారు. ఎన్టీపీసీ దేశానికి విద్యుత్ శక్తిని అందించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. సంస్థలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు మెరిటోరియస్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు ఎస్.గోవిందరాజన్, డి.ప్రసాద్ పాత్ర, డీఎల్‌సీ అధ్యక్షులు అంజూ సిన్హా, ఏజీఎం హెచ్‌ఆర్ రుమాడీశర్మ పాల్గొన్నారు.



పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- పరవాడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలు జరుపుకొనే పండగ గణతంత్ర దినోత్సవమన్నారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలంటే పరిపాలన నిస్వార్థంగా, చిత్తశుద్ధితో జరగాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వాలు పని చేసినపుడే అభివృద్ధి ఫలాలు ప్రజలకు సమంగా అందుతాయని చెప్పారు. ఎంపీడీవో వి.హేమసుందరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు తదితరులు పాల్గొన్నారు.
- పరవాడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన వేడుకల్లో పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్ఐలు మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.
- రావాడ శివారు ధర్మారాయుడుపేట జెడ్పీ పాఠశాలలో సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు కేఎస్ఏ రామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- తిక్కవానిపాలెం మండల పరిషత్ పాఠశాలలో సర్పంచ్ చేపల మసేను జెండాను ఎగరవేశారు.
- వెన్నలపాలెం గ్రామ సచివాలయంలో ఎంపీటీసీ సభ్యురాలు వెన్నల అరుణకుమారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, సచివాలయ కన్వీనర్లు వెన్నల సింహాద్రి, పైల జ్ఞానావతి, పైల మణి, పైల రేగారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహాచలం: పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వద్ద మువ్వన్నెల పతాకాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. గాంధీ మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ మధుపాడ నాగమణి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సింహాద్రి ఎన్టీపీసీలో బెలూన్లు ఎగరవేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు

- సుజాతానగర్‌లోని రవీంద్రభారతిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రమణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరంలో ప్రధాన ఘట్టాలను నాటిక రూపంలో విద్యార్థులు ప్రదర్శించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప చంద్రకళ, ఇన్‌చార్జి వెంకటేష్, డీజీఎం రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- చైతన్య టెక్నో స్కూల్‌లో ప్రిన్సిపాల్ తారకేశ్వరరావు జాతీయ పతాకాన్నిఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.వి.సురేష్, రీజినల్ ఇంచార్జి ఆశిబాబు, వైజాగ్ జోన్ అకడమిక్ కో–ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో అమృత్ సరోవర చెరువు గట్టుపై నిర్వహించిన వేడుకల్లో ఏపీపీ కె.గోవిందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈసీ రమేష్, టీఏ సహజ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో రిపబ్లిక్ డే వేడుకలు

సింహాచలం: గణతంత్ర దినోత్సవాన్ని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొండదిగువ దేవస్థానం పరిపాలనా కార్యాలయం వద్ద దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీ మహాత్ముడి చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. దేవస్థానం అధికారులు, వైదికులు, సిబ్బంది, వేద పాఠశాల, సంస్కృతోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

- అడవివరం కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ భవనం వద్ద సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, బోర ప్రసాద్, మజ్జి ధర్మా, పాలూరి సూరిబాబు, లండ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.
- సింహాచలంలోని ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
- అడవివరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ప్రసాద్ నాయక్ పతాకాన్ని ఆవిష్కరించారు.
- అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.
- సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల, అడవివరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.

భిన్నత్వంలో ఏకత్వం మన దేశ విశిష్టత

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని పార్కులో మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీడీవో రమేష్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భిన్న ప్రాంతాలు, పరిస్థితులు, భాషలు ఉన్న భారతదేశంలో భారతీయలమనే ఏకత్వ భావన మనందరినీ కట్టి పడేస్తుందన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమ సాధనలో ప్రాణత్యాగాలకు సిద్ధపడిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఏవో ఎస్.బాబూరావు, ఈవోపీఆర్డీ మహేష్, ఎంఈవో ఎస్.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు నారాయణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, అధికారులు



పోలీస్ స్టేషన్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఐ ఈశ్వరరావు

- సబ్బవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సత్యనారాయణ ప్రజా ప్రతినిధులతో కలిసి జెండా ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు.
- సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో సీఐ రంగనాథం తన సిబ్బందితో పాటు పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
- సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీధర్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో డైరెక్టర్ డాక్టర్ టి.రవీంద్ర జెండాను ఆవిష్కరించారు. డైరెక్టర్ డాక్టర్ నర్సింహ, డీజీఎం కె.బంగార్రాజు, సుభాషిణి, ఎస్.కె.ఎల్. రావు, వినోద్, వైద్యులు, విద్యార్థులు, పారామెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు



అడవివరం జెడ్పీ హైస్కూల్లో ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం



సబ్బవరం తహసీల్దార్ కార్యాలయంలో ..



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ రంగనాథం



సింహాద్రి ఎన్టీపీసీలో జెండావందనం చేస్తున్న జీజీఎం సిన్హా




అడవివరం కో-ఆపరేటివ్ సొసైటీ వద్ద జెండాకు సెల్యూట్ చేస్తున్న అధ్యక్షుడు అప్పలస్వామి

సింహగిరీశునికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన


- వైభవంగా నిత్యకల్యాణం
- విశేషంగా గరుడసేవ



గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



స్వర్ణ పుష్పాలు



నిత్య కల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టం

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవను కనులపండువగా జరిపించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

కమనీయం.. నిత్యకల్యాణం

స్వామికి నిత్యకల్యాణం మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేప చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

అప్పన్న స్వామికి గురువారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

సరస్వతీ నమస్తుభ్యం..

- చిన్నారులకు వైభవంగా అక్షరాభ్యాసాలు
- చదువులమ్మకు ప్రత్యేక పూజలు



ఉక్కు త్రిశక్తి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి, సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: శ్రీ పంచమి వేళ చిన్నారులంతా పలకాబలపం చేతబట్టి, చదువులమ్మ సన్నిధిలో ఓనమాలు దిద్దారు. సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాలు శాస్త్రోక్తంగా, వేడుకగా సాగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయం, హనుమాన్ దేవాలయాల్లో గురువారం సరస్వతీ పూజలు వైభవంగా జరిగాయి. త్రిశక్తి దేవాలయంలో సరస్వతీ దేవికి వేకువ జామున పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఫణి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాలకు తల్లిదండ్రులు తమ పిల్లలతో పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో మహాసరస్వతి మూల మంత్ర ప్రయుక్త అఖండ విద్యా హోమం నిర్వహించారు. అనంతరం సరస్వతీ దేవికి సహస్ర నాగవల్లి పత్ర సహిత శ్వేత పుష్పార్చన చేశారు. హనుమాన్ దేవాలయంలో ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో పుష్పాంజలి పూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాసాల్లో పలువురు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి మహా హారతి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానం ఉద్యోగులకు సేవా పురస్కారాలు



కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదగా సర్టిఫికెట్ అందుకుంటున్న డీఈఈ నాగేశ్వరరావు



కలెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: అప్పన్న దేవస్థానం ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. నగరంలో గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.సూర్యనారాయణ కలెక్టర్ మల్లికార్జున చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

పరవాడ గృహ నిర్మాణశాఖ ఏఈకి..

పరవాడ: గృహ నిర్మాణ శాఖలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన పరవాడ గృహ నిర్మాణశాఖ ఏఈ ఎం.ఎస్.ఎస్.ఎన్ రెడ్డికి ప్రభుత్వం నుంచి అత్యుత్తమ పురస్కారం లభించింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల్లో అనకాపల్లి జిల్లా కలెక్టరు రవి సుభాష్ ఏఈ రెడ్డిని అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

నావికుల సందడి

సింధియా : 1973 నేవల్ బోయ్స్ ఎంట్రీ బ్యాచ్‌కు చెందిన 27 మంది గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ సర్కార్‌లో సమావేశమయ్యారు. ఈ కర్యాక్రమానికి వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తా హాజరవ్వగా, మాజీ సైనికులు ఐఎన్ఎస్ సర్కార్ పరేడ్ గ్రౌండ్స్‌లో రిపబ్లిక్ పరేడ్‌ను నిర్వహించారు. అనంతరం వారు ఐఎన్ఎస్ సర్కార్ విండ్‌షీల్డ్ టూర్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా బ్యాచ్‌కు చెందిన నావికులు ట్రైనింగ్‌లో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న నేవీ అధికారులు

జోనల్ సిబ్బందికి పురస్కారాలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల్లో ఈ అవార్డులను ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రదానం చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.